సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 30 । నవంబర్ । 2024



స్థలం అమ్మకమా.. జాగ్రత్త

రియల్ ఎస్టేట్ ఏజెంట్లు భూముల క్రయవిక్రయాల్లో వడ్డీ షరతులో లొసుగులు వాడుకుని అమ్మకందారులను ఇబ్బంది పెడుతున్నారు. 8లో ▸



పేరు మార్చి వ్యాపారం

ఓ వ్యక్తి పేరిట మరో వ్యక్తి ఎనిమిదేళ్లుగా వ్యాపారం చేయడం, అద్దె బకాయిలు ఎగ్గొట్టడం నూజివీడు ట్రిపుల్ ఐటీలో వెలుగుచూసింది. 8లో ▸



నగల దుకాణంలో చోరీ

నగల దుకాణంలో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి నగలు దోచుకున్న సంఘటన రమణక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸

ధాన్యాగారంగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో తొలకరి ధాన్యం సిరులు తగ్గుతున్నాయి. ప్రభుత్వం, వాతావరణం కలిసిరాకపోవడం సాగుపై ప్రభావం చూపాయి. ఖరీఫ్ సీజన్ రైతులకు కలిసిరాలేదు. సీజన్ మొత్తంలో మూడుసార్లు భారీ వర్షాలు, వరదలు పంటలను దెబ్బతీశాయి. దీంతో పలుమార్లు నాట్లు, నారుమడులు వేసుకోవాల్సి వచ్చింది. వేలాది ఎకరాలను సాగు చేయలేక రైతులు ఖాళీగా వదిలేశారు. దీంతో 2.14 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం కాగా 2 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. **ఎకరాకు 35 బస్తాల సాధారణ దిగుబడి సగటున 30 బస్తాల వరకు పడిపోయింది.**

ధాన్యాగారం.. దయనీయం



చివరికి కన్నీరే..!

- కలిసిరాని సర్కారు, వాతావరణం
- జిల్లాలో 14,135 ఎకరాల్లో సాగవ్వని ఖరీఫ్ పంట
- 2 లక్షల ఎకరాలకు తగ్గిన విస్తీర్ణం
- వర్షాలతో దిగుబడులపై ప్రభావం
- గతేడాది 5.62 లక్షల టన్నుల దిగుబడి
- ఈ ఏడాది అంచనా 4.50 లక్షల టన్నులు
- పెట్టుబడులు కూడా కష్టమంటున్న రైతులు

జిల్లాలో వరి సాగు

గత సీజన్‌లో విస్తీర్ణం	2.14	లక్షల ఎకరాలు
ఈ ఖరీఫ్‌లో విస్తీర్ణం	2.00	లక్షల ఎకరాలు

గత సీజన్‌లో దిగుబడి	ఈ ఖరీఫ్‌లో దిగుబడి (అంచనా)
5.62 లక్షల టన్నులు	4.50 లక్షల టన్నులు

సాక్షి, భీమవరం: ఖరీఫ్ (సార్వా) **సీజన్ రైతులకు** కలిసి రాలేదు. సాగు మొదట్లోనే **భారీ వర్షాలు, వర** దలు పంటకు నష్టం కలిగించాయి. **ఆగస్టు చివర్లో** కురిసిన వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు ముంపుతో జిల్లావ్యాప్తంగా 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాలకు చెందిన నారుమడులు దెబ్బతిని రెండోసారి నాట్లు, నారుమడులు వేసుకోవాల్సి వచ్చింది. మరలా సెప్టెంబరులో గోదావరి, కొల్లేరు వరదలతో జిల్లాలోని దాదాపు 13,300 ఎకరాల్లో మరోమారు నష్టం వాటిల్లింది. ముంపు పొలాల్లో గుర్రపుడెక్క మేటలు వేయడం, పెట్టుబడుల రెట్టింపు కావడంతో నష్టాలకోర్చి సాగుచేయలేక కొందరు రైతులు పొలాలను ఖాళీగా వదిలేశారు. ఆయా కారణాలతో జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.14 లక్షల ఎకరాల నుంచి 2 లక్షల ఎకరాలకు తగ్గింది. అధికారిక లెక్కల ప్రకారం గత సీజన్‌తో పోలిస్తే జిల్లాలోని 14,135 ఎకరాలు ఖరీఫ్ సాగు చేయకుండా ఖాళీగా వదిలేశారు. అధికంగా భీమవరం మండలంలో 3 వేల ఎకరాలు, యలమంచిలి మండలంలో 1,700 ఎకరాలు, గణపవరం, పెనుగొండ మండలాల్లో దాదాపు 1,500 ఎకరాల చొప్పున, పోడూరు, ఆచంట మండలంలో 1,000 ఎకరాల చొప్పున తగ్గాయి. ధాన్యం సిరులు కురిపించే పంటపొలాలు పిచ్చిమొక్కలు, తూడుతో బీడులుగా మారిపోయాయి.

అన్నదాత దుఃఖీభవ!

కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7,500 జతచేసి ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మొదటి విడతగా రూ.7,500, ఖరీఫ్ చివర్లో రూ.4,000, మరో విడతలో రూ.2,000 ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాలకు జమచేసేది. అలాగే విపత్తుల సమయంలో నష్టనివారణ చర్యలతో రైతులకు కొండంత అండగా నిలిచేది. అయితే ఏడాదికి రూ.20 వేల చొప్పున రైతులకు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు ఖరీఫ్ పూర్తవుతున్నా ఈ ఊసెత్తడం లేదు. తొలకరిలో పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదన్న విమర్శలు ఉన్నాయి.



అత్తిలి మండలంలో ఖరీఫ్ సాగు చేయకుండా ఖాళీగా వదిలేసిన పంట పొలం

వర్షాలు ముంచి.. దిగుబడి తగ్గి..

వరి సాగులో 60 శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1318 సాగు చేయగా, 30 శాతం మేర స్వర్ణ, సంపద స్వర్ణ వంగడాలను పండించారు. భారీ వర్షాలు, వరదలకు తోడు సీజన్ పొడవునా చాలా వరకు ఆకాశం మేఘావృతమై ఎండకాసే సమయం (సన్‌షైన్ అవర్స్) తక్కువగా ఉండటం పంట దిగుబడులపై ప్రభావం చూపింది. తొలకరిలో ఎకరాకు 34 బస్తాల నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొన్నిచోట్ల దిగుబడులు బాగానే ఉన్నా ఆయా కారణాలతో అధిక శాతం విస్తీర్ణంలో ఇప్పుడు 25 నుంచి 30 బస్తాలలోపే ఉందని రైతులు అంటున్నారు. భారీ వర్షాలు, వరదలతో నష్టం వాటిల్లిన కొన్ని ప్రాంతాల్లో 20 బస్తాలలోపే వస్తున్నట్టు చెబుతున్నారు. సాగుకోసం పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదంటున్నారు. గత సీజన్‌లో ఎకరాకు సగటున 35 బస్తాల చొప్పున మొత్తంగా 5.62 లక్షల టన్నుల దిగుబడి వచ్చినట్టు అంచనా. ఈసారి సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 30 బస్తాల చొప్పున సుమారు 4.50 లక్షల టన్నుల దిగుబడి అంచనా. గత సీజన్‌తో పోలిస్తే 1.12 లక్షల టన్నుల వరకు ధాన్యం దిగుబడులు తగ్గడం గమనార్హం.

దిగుబడి బాగా తగ్గింది



సార్వాలో దిగుబడి గణనీయంగా తగ్గింది. మా సూళ్ల మొదట్లోనే తుపానుల వల్ల పెట్టుబడులు బాగా పెరిగాయి. మూడుసార్లు నాట్లు వేశాం. ఎకరాకు సాధారణంగా రూ.20 వేల పెట్టుబడి అయితే ఈ సీజన్‌లో రూ.30 వేలు అయ్యింది. ఎకరాకు 28 బస్తాల లోపే దిగుబడి వచ్చింది.

– తాడేపల్లి యోహాన్, కౌలు రైతు, కె.పెంటపాడు

చాలా నష్టం



రెండు ఎకరాల కౌలుకి వరి పొలం సాగు చేస్తున్నాను. సార్వా సీజన్‌లో 30 నుంచి 35 బస్తాల దిగుబడి ఉంటే బాగుంటుంది. చీడ పీడల ఉధృతి, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం 25 నుంచి 28బస్తాలు ఎకరాకు దిగుబడి వస్తోంది. రైతుకు చాలా నష్టం వాటిల్లుతోంది.

– పోలిశెట్టి కృష్ణ, కౌలు రైతు, రాయకుదురు

ఈనిక దశలో వర్షాలు



ఈనిక దశలో వర్షాలు ఎక్కువగా పడటంతో సార్వా సీజన్‌లో దిగుబడులు బాగా పడిపోయాయి. నేను దాదాపు పది ఎకరాల్లో వరి పండిస్తున్నాను. గతేడాది సార్వాలో ఎకరాకు దాదాపుగా 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరాకు 30 బస్తాల దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది.

– మండ కాసుల రెడ్డి, కవిటం

పెట్టుబడులు కూడా రాలేదు



రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ తొలకరిలో భారీ వర్షాల వలన రెండుసార్లు నాట్లు వేయాల్సి వచ్చింది. ఎకరానికి 26 బస్తాల దిగుబడి మాత్రమే రావడంతో పాటు పెట్టుబడులు కూడా రాక నష్టపోయాం. దీంతో దాళ్వా సాగు పెట్టుబడులకు చాలా ఇబ్బందిగా ఉంది.

– సుంకర వెంకటేశ్వరరావు, గుమ్ములూరు, ఆకివీడు మండలం

న్యూస్‌రీల్

క్షీరారామంలో హైకోర్టు న్యాయమూర్తి



పంచారామంలో హైకోర్టు జడ్జి సుజాత

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (క్షీరారామం)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయానికి విచ్చేసిన ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. పట్టణ జడ్జి షేక్ జియావుద్దీన్, డీఎస్పీ వేద, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, సీఐ రజనీకుమార్, కోర్టు సూపరింటెండెంట్ జె.సోమేశ్వరరావు, ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

లేసు పార్కు సందర్శన



లేసు అల్లికలను పరిశీలిస్తున్న ఆర్జేడీ లక్ష్మణరావు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురంలో లేసు పార్కును చేనేత, జౌళి, హస్తకళల శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎ.లక్ష్మణరావు శుక్రవారం సందర్శించారు. ఇటీవల నరసాపురం లేసులకు భౌగోళిక గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. దీంతో ఆర్జేడీ లేసు పార్కులోని ముడిపదార్థాలు, అల్లికలు, లేసు ఉత్పత్తులను పరిశీలించారు. ఏడీ అపర్ణలక్ష్మి, లేసు పార్కు మేనేజర్ కుసుమకుమారి, అకౌంట్స్ మేనేజర్ పాలంకి రమేష్ ఆయన వెంట ఉన్నారు.

3, 4 తేదీల్లో పాలిటెక్ ఫెస్ట్

పెంటపాడు: తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిసెంబర్ 3,4 తేదీల్లో రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కో–ఆర్డినేటర్ డి.ఫణీంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ నాగరాణి, పలు పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి జిల్లాలోని 11 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన 250 మంది, పలు బ్రాంచ్‌ల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఫెస్ట్‌లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, రెండో స్థానానికి రూ.10 వేలు నగదు బహుమతులు అందిస్తారన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఫెస్ట్‌కు ఎంపిక చేస్తామన్నారు.

ఇన్‌చార్జి ప్రణాళిక అధికారిగా కంటిపూడి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మోహన్‌రావును జాయింట్ డైరెక్టర్‌గా అమరావతి ఏపీ సెక్రటేరియట్‌లోని ప్లానింగ్ శాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో కంటిపూడి శ్రీనివాసరావును పశ్చిమగోదావరి ఇన్‌చార్జి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా నియమించారు.

పేరు తొలగింపు వేగవంతం

పెంటపాడు: జగనన్న భూరక్ష–2020 పేరు తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతోందని జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్ (డీఎస్‌ఎల్‌ఓ) అధికారి జాషువా అన్నారు. మండలంలోని యానాలపల్లి, ఎస్‌పీపురం, బోడపాడు గ్రామాల్లో సర్వే రాళ్లపై పేర్లను తొలగిస్తుండగా శుక్రవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని వేగంగా చేపట్టామని ఆయన అన్నారు. మండల సర్వే లాండ్ అధికారి రౌతు రామకృష్ణ, గ్రామ సర్వేయర్ సతీష్, ఫణికుమార్, వీఆర్వో బి.పద్మ ఉన్నారు.

ఉత్సాహంగా గురుకుల పోటీలు



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

పెదవేగి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో పెదవేగిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయి గురుకుల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ఉత్సాహంగా సాగుతోంది. రెండోరోజు శుక్రవారం అథ్లెటిక్, గేమ్స్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, పరుగు పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అధికారి కె.జయరాజు పర్యవేక్షించారు.

కూటమి పాలనలో దగాపడ్డ ప్రజలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు



ఆచంట నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు. చిత్రంలో ఎమ్మెల్సీ వంక, మాజీ మంత్రి చెరుకువాడ, సమన్వయకర్త ఉమాబాల

పెనుగొండ: కూటమి నాయకుల కల్లబొల్లి వాగ్దానాలు నమ్మి తాము మోసపోయినట్టు ప్రజలు గ్రహిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆచంట నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రసాదరాజు మాట్లాడుతూ చంద్రబాబు హామీలను ప్రజలతో పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నమ్మారన్నారు. గద్దెనెక్కిన తర్వాత షరా మామూలే అన్నట్టు చంద్రబాబు హామీలను మరిచి అన్నివర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పునర్నిర్మాణం చేపట్టడానికే సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను అధినేత జగన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. త్వరలోనే జగన్ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయనున్నారన్నారు. పార్టీ నిర్మాణంపై జగన్ దృష్టి సారించారని, పార్టీ శ్రేణులకు పెద్దపీట వేస్తారని ముదునూరి భరోసా ఇచ్చారు.

ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు. పాలకుల హామీలను నమ్మి మోసపోయిన ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజులు రానున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలకు అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాసేవకు ఎల్లవేళలా అందుబాటులో..



పదవులు ముఖ్యం కాదని, నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్యం వంటి సేవలందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గెలుపోటములు సహజమని, ఎవరూ శాశ్వతంగా అధికారంలో ఉండరన్నారు. అధికారం ఉందని ఎవరు విర్రవీగినా పతనం తప్పదన్నారు. నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, ఎంపీపీలు కర్రి వాసురెడ్డి, సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, పోతుమూడి రామచంద్రరావు, మండల కన్వీనర్లు గూడూరి దేవేంద్రుడు, జక్కంశెట్టి చంటి, నల్లిమిల్లి వేణు ప్రతాపరెడ్డి (బాబిరెడ్డి), పిల్లి నాగన్నలు, ఎస్సీ సెల్ కన్వీనర్ పలివెల శ్రీను, బుర్రా రవికుమార్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

భూముల విలువలపై అధ్యయనం



రాహుల్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): సామాన్యులకు భారం కాకుండా భూముల విలువలపై అధ్యయనం చేసి రేట్లు నిర్ణయించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో 15 మంది సబ్ రిజిస్ట్రార్లు సమర్పించిన మార్కెట్ విలువల ప్రతిపాదనలు పరిశీలించారు. శివారు ప్రాంతాలు, గ్రామాలు, పంట భూములు, ఫిష్ ట్యాంకులు తదితర వాటికి రేట్లను సమీక్షించారు. గతానికి ఇప్పటికీ రేట్ల పెరుగుదలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో భూముల విలువలు ఒకే రకంగా ఉండాలని, తారతమ్యాలు లేకుండా చూడాలన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో భూముల విలువలు ఏ మాత్రం పెంచవచ్చనే విషయంపై గతంలో రేట్లను బేరీజు వేసుకోవాలన్నారు. గతంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు తర్వాత ఏర్పాటుచేసిన కాంప్లెక్స్‌లకు రేట్లలో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. భూముల విలువల పెరిగిన కారణంగా ప్రజలు రిజిస్ట్రేషన్ చార్జీలను భారంగా భావించేలా ఉండకూడదన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



కేంద్రమంత్రి వర్యులు భూపతిరాజు శ్రీనివాసవర్మ (బిజెపి వర్మ) గారి తండ్రి గారైన
కీ॥శే॥ భూపతిరాజు సూర్యనారాయణరాజు గారు
జననం : 01-11-1935 నిర్యాణం : 21-11-2024
కల్మష మెరుగని నిష్కళంక హృదయులుగా మమ్ములను పెంచి పోషించి విద్య, విలువలను, విజ్ఞానాన్ని అందించి మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన మూల పురుషులు మీరు. మీ మహోన్నత ఆశయాలకు, ఉదాత్త ఆదర్శాలకు అనుగుణంగా నడుస్తామని.. దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాం.
బాధాతప్త హృదయులతో: భార్య : భూపతిరాజు సీత
కుమారుడు - కోడలు
భూపతిరాజు శ్రీనివాసవర్మ (బిజెపి వర్మ) - శ్రీమతి వెంకటేశ్వరి దేవి
కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు
సోదరులు
దశాహం, షోడశ, సపిండీకరణ : ది. 01-12-2024 ఆదివారం ఉదయం 9 గంటలకు
సంతాప సభ : K.S.రాజు ఫంక్షన్ హాల్, మార్కెట్ యార్డు వద్ద, భీమవరం

క్లుప్తంగా

భీమవరంలో వైనాట్ రెండో బ్రాంచ్ ప్రారంభం



భీమవరంలో వైనాట్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం : ఎలక్ట్రానిక్స్ రంగంలో వైనాట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరుందని ఖాతాదారులకు మంచి సేవలందిస్తున్నట్లు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పరుచూరి కిషోర్‌బాబు అన్నారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని లూథరన్ చర్చి సమీపంలో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైనాట్ మేనేజింగ్ డైరెక్టర్ జుజ్జవరపు వెంకటరాయుడు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అన్ని ఎలక్ట్రానిక్స్ వస్తువులు తక్కువ ధరకు అందిస్తున్నామని చెప్పారు. భీమవరం వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేందుకు రెండో బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు.

ఆట్యా-పాట్యా పోటీలకు ఏర్పాట్లు పూర్తి



భీమవరంలో ఆట్యా-పాట్యా పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరం పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాల ఆవరణలో నవంబర్ 30, డిసెంబరు 1న 11వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఆట్యా - పాట్యా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆట్యా -పాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, ఎ.కిరణ్ వర్మ చెప్పారు. పోటీలకు సంబంధించిన శుక్రవారం స్కూల్ ఆవరణలో ఏర్పాట్ల సందర్భంగా వివరాలు వెల్లడించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి పురుషుల, మహిళల జట్లు పాల్గొంటున్నాయన్నారు. డీఎన్నార్ కళాశాల అసోసియేషన్, పట్టణంలోని దాతల సహకారంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కేసీపీ శేఖర్‌రాజు, స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీలు రామభద్ర రాజు, ఉన్నమట్ల బాబి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో బాలుడికి తలకు గాయాలైన దృశ్యం

కామవరపుకోట : స్థానిక కొత్తూరు గంగానమ్మ గుడి ప్రాంతంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పిచ్చికుక్క కరవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలవగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులున్నారు. నాలుగేళ్ల బాలుడిని తీవ్రంగా గాయపరచడంతో మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానిక ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వీధి కుక్కలను కట్టడి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్థలం అమ్మకమా.. అగ్రిమెంట్‌తో జాగ్రత్త

- వడ్డీ షరతు అగ్రిమెంట్లతో నష్టపోతున్న అమ్మకందారులు
- వడ్డీ సాకుగా చూపించి ఏళ్ల తరబడి తిప్పుతున్న రియల్టర్లు

పాలకొల్లు సెంట్రల్: స్థలాలు అమ్మినా.. కొన్నా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు, డబ్బులు పూర్తిగా చెల్లించేందుకు వడ్డీ షరతు రాసుకుంటున్నారు. అయితే ఈ వడ్డీ షరతులో కొన్ని లోసుగుల్ని వాడుకుని రియల్ ఎస్టేట్ ఏజెంట్లు అమ్మకందారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అమ్మాయికి పెళ్లి చేయాలనో, లేదా స్థలం అమ్మి మరో చోట కొనుగోలు చేసుకోవాలనో, విద్య, వైద్య సమస్యలు, ఇంటి నిర్మాణం, ఆర్థిక ఇబ్బందులు ఇలా అనేక కారణాలతో ఆస్తులు విక్రయిస్తుంటారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు మాత్రం మన సమస్య తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా వాయిదా వేస్తూ.. కొనుగోలుదారుడిని వేధిస్తున్నారు.

వడ్డీ షరతు సాకుగా చూపి..

స్థలం, పొలం, ఇల్లు ఇలా ఏది అమ్మినా మూడు నెలలు అగ్రిమెంట్ వ్రాసుకుంటారు. పెద్ద ఆస్తి విక్రయించినప్పుడు ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం కాలం గడువు ఇస్తుంటారు. అలా ఇచ్చిన గడువు ముగిసేలోపు కొనుగోలుదారుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలా సమయానికి రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతే నూటికి రూ.1.50 లేదా రూ.2 వడ్డీ షరతు రాసుకుంటారు. స్థలం విక్రయదారుడి ఆర్థిక ఇబ్బందులు బయటకు తెలిస్తే ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలేదు. వడ్డీ షరతు ఉందిగా.. వడ్డీ ఇస్తాంలే అని సమాధానం చెబుతున్నారు. దీంతో అమ్మకందారుడికి సమయానికి డబ్బులు అందక.. ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బ్రోకర్లు కమిషన్‌కు బదులు మార్జిన్ వేసుకుంటారు. కొంత నగదు పెట్టుబడి పెట్టి ముందుగా బ్రోకర్లే అగ్రిమెంట్ రాయిస్తుంటారు. అక్కడ నుంచి స్థలం విక్రయాలు జరిగితేనే స్థల యజమానికి డబ్బులు సరిపెడతారు. లేదంటే సమస్య మొదలవుతుంది. అడిగితే సమాధానం ఉండదు. కొన్ని చోట్ల అగ్రిమెంట్‌ను నలుగురైదుగురు కలిసి రాయించుకుంటున్నారు. స్థల విక్రయదారుడు ఎవరికి ఫోన్ చేసినా మిగిలిన వాళ్లు అందుబాటులో లేరని వారు వచ్చిన వెంటనే మీ డబ్బు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని చెబుతున్నారు.

పది నెలలైనా చేతికందని డబ్బు

పాలకొల్లుకు చెందిన టి.కృష్ణవేణి వయసు 70 ఏళ్లు. ఆమెకు యలమంచిలి మండలం గుంపర్రులో ఎకరం భూమి ఉంది. ఆర్థిక ఇబ్బందులతో భూమి విక్రయించాలని బేరం పెట్టగా రియల్టర్లు కొనుగోలు చేశారు. ఈ ఏడాది జనవరిలో ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునేలా వడ్డీ షరతుతో అడ్వాన్సుగా 25 శాతం నగదు ఇచ్చి నలుగురి పేరున అగ్రిమెంట్ రాయించుకున్నారు. అగ్రిమెంట్ రాసి పది నెలలు కావస్తుంది. ఆమె, కుమారులు ఎన్ని సార్లు ఫోన్ చేసినా రియల్టర్లు స్పందించడం ఒకరు స్పందిస్తే మిగిలిన ముగ్గురూ బిజీగా ఉన్నారని.. అందుబాటులోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని చెబుతున్నారు. వడ్డీ షరతు ఉంది కదా తొందరెందుకని ప్రశ్నిస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్దామన్నా సివిల్ కేసు అంటారని పలువురు చెప్పడంతో ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఆ కుటుంబం ఎదురుచూస్తుంది.



చిన్న స్థాయి వ్యక్తులకు ఇబ్బందులు

స్థలం విక్రయించి ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విక్రయదారులు పలుకుబడి ఉంటే ఏదో రకంగా సమస్యను పరిష్కరించుకుంటారు. చిన్న స్థాయి వ్యక్తులైతే నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. సెటిల్ మెంట్ బ్యాచ్‌లను సంప్రదిస్తే... సమస్య పరిష్కారం అవ్వడానికి మరికొన్ని నెలలు పడుతుంది. సెటిల్ చేసినందుకు వారికి పారితోషికం ఇవ్వాలి.

కోర్టు నోటీసులు పంపినా ..

పాలకొల్లు మండలం అడవిపాలెంకు చెందిన డీఎస్ రావుకు యలమంచిలి మండలం మేడపాడులో 25 సెంట్లు భూమి ఉంది. అన్నకు ఇవ్వాలని నగదు నిమిత్తం భూమి విక్రయించాడు. కొనుక్కున్న వ్యక్తి మరొకరికి అమ్మేశాడు. ఈ భూమి క్రయవిక్రయాలు జరిగి సుమారు 30 నెలలు కావస్తుంది. కొనుక్కున్న వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. స్థలం అవసరానికి ఉపయోగపడలేదని బయట వడ్డీకి తీసుకువచ్చామని డీఎస్ రావు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోర్టు నోటీసులు పంపించామని అయినా స్పందన లేదని ఆవేదన చెందుతున్నారు.

కోర్టును ఆశ్రయిస్తే మరిన్ని సమస్యలు

కోర్టుకు వెళ్తే కోర్టు ఖర్చులు నిమిత్తం కొంత పెట్టుబడి పెట్టాలి. అన్నీ చేసినా సమస్య ఎప్పటికి తేలుతుందో చెప్పలేం. రియల్టర్లకు మాత్రం ఇలా కోర్టుకి వెళితే కొంత గడువు దొరుకుతుంది. ఈ లోపు వచ్చిన నగదుతో మరో చోట క్రయవిక్రయాలు చేయవచ్చనే కోణంలో వడ్డీ షరతు అగ్రిమెంట్‌ను అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా చేస్తున్నారు. కొన్నాళ్లు గడిచాక వడ్డీ ఇవ్వలేం.. అసలు ఇస్తాం.. రిజిస్ట్రేషన్ చేస్తానంటే చెప్పండి అంటూ బ్లాక్‌మెయిల్ దందాకు దిగుతున్నారు. ఈ సమస్యలపై పోలీసులను ఆశ్రయిస్తే.. ఇది సివిల్ మేటర్ కోర్టును ఆశ్రయించాలని చెబుతారు.

రద్దు అగ్రిమెంట్ మేలు

ఏదైనా స్థలం విక్రయించినప్పుడు వడ్డీ షరతుతో రాసే అగ్రిమెంట్ మూడు నెలల నుంచి సంవత్సర వరకూ ఉంటుంది. ఏ సమస్య లేకుండా ఉండాలంటే రద్దు అగ్రిమెంట్ రాసుకుంటే కొనుగోలు చేసిన వారికి భయం ఉంటుంది. అమ్మకున్న వారికి భరోసా ఉంటుంది.

రద్దు అగ్రిమెంట్‌లోనూ సమస్య

రద్దు అగ్రిమెంట్ మూడు నెలలకు రాస్తారు. కొనుగోలు చేసుకునే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకునే లోపు ఆ స్థలం విలువ పెరగవచ్చు. అప్పుడు అమ్మకందారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా ఉంటే గడువు ముగిసిపోతుంది. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉన్నా విక్రయదారుడు ఎదురు తిరగవచ్చు. వీటన్నిటిపై న్యాయ సలహాలు తీసుకుని అగ్రిమెంట్ రాయించుకోవడం మంచిది.

రద్దు అగ్రిమెంట్‌తో ఇద్దరికీ మేలు



వడ్డీ షరతు అగ్రిమెంట్‌ల వల్ల ఆర్థిక ఇబ్బందులతో స్థలాలు విక్రయించుకునే వ్యక్తులు ఇబ్బందులకు గురవుతున్నమాట వాస్తవమే. వడ్డీ షరతు అగ్రిమెంటు గడువు మూడేళ్ల వరకూ ఉంటుంది. ఉభయులకు అంగీకారమైతే రద్దు అగ్రిమెంట్ రాసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ లోపు ధర పెరిగితే అమ్మిన వ్యక్తిలో మార్పు వచ్చి రిజిస్ట్రేషన్ చేయకపోవచ్చు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తి నష్టపోతాడు. రద్దు అగ్రిమెంట్ రాసుకున్నప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకునే వ్యక్తి అమ్మిన వ్యక్తికి ఇవ్వాల్సిన నగదు డీడీ రూపంలో లేక నగదు రూపంలో బ్యాంకులో జమ చేసి సదరు అమ్మిన వ్యక్తికి కోర్టు ద్వారా నోటీసు ఇవ్వాలి. ఇలా ఇవ్వడం వల్ల కొనుగోలు చేసిన వ్యక్తి లబ్ధి పొందుతాడు. రద్దు అగ్రిమెంటు చేసుకోవడం వల్ల ఇద్దరూ సమస్య లేకుండా లబ్ధి పొందే అవకాశం ఉంది.

– వలవల సత్యనారాయణమూర్తి, న్యాయవాది, పాలకొల్లు



కబడ్డీ ఆడుతున్న కలెక్టర్ నాగరాణి



అధికారుల ఆటవిడుపు

ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు కాసేపు ఆటపాటలతో సేదదీరారు. కార్తీక వన సమారాధనలో భాగంగా జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ ఉద్యోగులు ఒక చోట చేరి సందడి చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొని ఆటలు ఆడారు. కాసేపు సరదా కబుర్లు చెప్పుకున్నారు. ఈ ఆటవిడుపులో ఉద్యోగులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

– భీమవరం(ప్రకాశం చౌక్)

కలెక్టరేట్ ఉద్యోగుల వన సమారాధన

రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారుల వనసమారాధన కలెక్టరేట్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమం మామిడి తోటలో సందడిగా సాగింది. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి రెండు జట్లుగా ఏర్పడి వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆడారు. కబడ్డీ ఆడుతూ కలెక్టర్ సిబ్బందిని ఉత్సాహపరిచారు. డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు కార్తీక మాసం విశిష్టత గురించి వివరించారు. ఆకివీడు తహసీల్దార్ ఫోక్ సాంగ్, ఆకివీడు మున్సిపల్ కమిషనర్ పేరడీ సాంగ్, మున్సిపల్ టీచర్ అమ్మపాట, కలెక్టరేట్ సిబ్బంది పాటలు అకట్టుకున్నాయి. ఆటల్లో గెలుపొందిన సిబ్బందిని కలెక్టర్ అభినందిస్తూ బహుమతులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి ఆటవిడుపు కార్యక్రమం ఉద్దేశంతో వన సమారాధన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్, జేసీ

పేరు మార్చి వ్యాపారం

- ట్రిపుల్ ఐటీలో ఎనిమిదేళ్లుగా షాపు నిర్వహణ , అద్దెకు ఎగనామం
- బకాయిలు ఎగ్గొట్టడంతో అసలు విషయం వెలుగులోకి

నూజివీడు: ఒక వ్యక్తి పేరిట మరో వ్యక్తి ఎనిమిదేళ్లుగా వ్యాపారం చేయడం, అద్దె బకాయిలు ఎగ్గొట్టడం నూజివీడు ట్రిపుల్ ఐటీలో వెలుగు చూసింది. బకాయి ఉన్న అద్దెను చెల్లించాలని అసలు షాపు యజమానికి ట్రిపుల్ ఐటీ అధికారులు నోటీసు పంపడంతో ఈ వ్యవహారం బయటపడింది. నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీబొమ్మ సెంటర్‌లో పేర్ల అమర్‌నాథ్ శ్రీ విజయ ఫ్యాన్సీ అండ్ కాఫీ వర్క్స్ షాపు నడుపుతున్నాడు. అతనికి తెలియకుండా అదే పేరుతో నూజివీడు ట్రిపుల్ ఐటీలోని కే2 బాలికల హాస్టల్‌లో శీలం సాంబశివరావు ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. 2016 నుంచి ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరు వరకు 8 ఏళ్ల పాటు షాపు నిర్వహించిన సాంబశివరావు ట్రిపుల్ ఐటీకి రూ.15.58 లక్షల అద్దె బకాయి చెల్లించాలి. బకాయి ఉన్న అద్దెను చెల్లించాలని కోరుతూ ఈ నెల 2న అమర్‌నాథ్‌కు ట్రిపుల్ ఐటీ ఏఓ నోటీసు పంపగా అతను అవాక్కయ్యాడు. ఈ విషయంపై ఏఓను ప్రశ్నించగా.. అసలు మోసం వెలుగు చూసింది. ట్రిపుల్ ఐటీలో దుకాణాల ఏర్పాటుకు టెండర్లు పిలిచినప్పుడు సాంబశివరావు శ్రీ విజయఫ్యాన్సీ అండ్ కాఫీ వర్క్స్ పేరుతో టెండర్లు వేసి షాపును దక్కించుకున్నాడు. అప్పటి నుంచి షాపును నిర్వహిస్తున్నాడు. ఏడాదికి దాదాపు రూ.కోటి వ్యాపారం చేస్తూ వచ్చినప్పటికీ బిల్లులు చూపించకకుండా జీఎస్టీని చెల్లించలేదు. ఎనిమిదేళ్లలో దాదాపు రూ.10 కోట్ల వ్యాపారం చేసి రూపాయి కూడా పన్ను చెల్లించకపోవడం గమనార్హం. అసలు ఓనర్‌కు ఈ విషయం తెలియలేదు. గత నెల 24న కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్లు నోటీసు ఇచ్చిన తరువాత సాంబశివరావు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. దీనిపై అమర్‌నాథ్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలలపై చంద్రబాబు చిన్నచూపు

ఏలూరు (టూటౌన్): చంద్రబాబు నాయుడు మాలల్ని చిన్న చూపు చూస్తున్నారని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్(రిటైర్డ్ ఐఆర్‌ఎస్) అన్నారు. స్థానిక పత్తేబాదలోని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్ల నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తున్నామనడం చాలా దారుణమైన విషయమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తరువాతే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాననడం సరైంది కాదన్నారు. 2029లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మాలలు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. డిసెంబరు 15న గుంటూరులో మాలల మహా గర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని.. ఈ సభకు లక్షలాది మంది మాలలు కదిలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జై భీమ్ ఆర్మీ జాతీయ ప్రధాన కార్యదర్శి పాలిమెట్ల మోజేష్, ఆర్మీ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కంచర్ల కిషోర్, జిల్లా యువజన అధ్యక్షుడు బేతపూడి నవీన్, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి చాగంటి సంజీవ్, ఆలగ రవికుమార్, గొల్ల కిరణ్, దళిత నాయకులు ఊదరుకొండ కుమార్ రాజ, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, నూతలపాటి నవీన్, దిలీప్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]

■ AP & TG ప్రముఖ TV చానల్లో మీ జిల్లాలో పనిచేయుటకు డిస్ట్రిక్ ఇన్‌చార్జ్, నియోజకవర్గ ఇన్‌చార్జెస్, మండల రిపోర్టర్స్ కావలెను. సంప్ర।। 94939 47007 [V- 823957]

■ కష్టలేన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD. 7995365999 [HA-99148]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము, భోజనము సదుపాయం, వర్క్ ఫ్రంహోం అవకాశముంది. సం:6360538831 [G-9084]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:8121818692 [G-9087]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000. సంప్ర।। 95507 45296. [V- 6609]

■ ఏలూరులోని ప్రఖ్యాత షాపింగ్ మాల్‌లో 3 సం. అనుభవంగల Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 14000/-, PF, ESI లతో. 12 గం. షిఫ్ట్, డ్యూటీ పై ఫ్రీ మీల్స్. సంప్ర।। 85238 44364 [B-807202]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మార్టేరులో పోలీసు బాస్కెట్‌బాల్ టీంకు శిక్షణ



మార్టేరులో శిక్షణ పొందుతున్న ఏపీ పోలీస్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

పెనుమంట్ర: మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోలీసు బాస్కెట్‌బాల్ టీంకు శిక్షణ ఇస్తున్నారు. ఖండవల్లి కిశోర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ ప్లేయర్ సత్తి సుబ్బన్నరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ టీంకు వసతి, భోజనం ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది జనవరిలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలకు గత నాలుగు నెలల నుంచి ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఎంతోమంది క్రీడాకారులు ఇక్కడ నుంచే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, అందువల్లే ఈ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి వచ్చారని చెప్పారు. ఏపీ పోలీస్ టీం కోచ్‌లు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్టేరు క్రీడా ప్రాంగణం నుంచి ఎంతో మంది జాతీయ స్థాయికి ఎదిగారని, అందుకే ఈ క్రీడా మైదానంలో 20 రోజులు ప్రాక్టీస్ చేయాలని వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ క్రీడా రంగంలో రిక్రూట్‌మెంట్ ఉండదని, ఈ టీంలో ఆడుతున్న నిరుపేద క్రీడాకారులకు ఉద్యోగ భద్రత కల్పిస్తే బాగుంటుందన్నారు.

నగల దుకాణంలో భారీ చోరీ

ముసునూరు: నగల దుకాణంలో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి నగలు దోచుకున్న సంఘటన మండలంలోని రమణక్కపేటలో జరిగింది. రమణక్కపేటలో తాళం వేసి ఉన్న నగల దుకాణం విద్యుత్ కనెక్షన్లు తొలగించి, షట్టర్లు పగలగొట్టి గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం డోర్లు పగలకొట్టి ఉండడాన్ని గమనించిన యజమాని వంకదారు విఘ్నేశ్వరరావు ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై ఎం.చిరంజీవి, చాట్రాయి ఎస్సై రామకృష్ణ, రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పలు ప్రదేశాల్లోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. చోరీ గురైన నగదు, బంగారం, వెండి వివరాలు వెల్లడించలేదు.

రంగుల పంట.. సిరులే నట్టింట

- స్వల్ప పెట్టుబడితో అధిక లాభాలు
- పోడు, మెట్ట భూముల్లో వర్షాధారంపై సాగు







దాసియ్యపాలెంలో వేసిన జాఫ్రా పంట, జాఫ్రా మొక్కలను సరఫరా చేస్తున్న రైతు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ఒక గిరిజన మహిళా రైతు పండిస్తున్న రంగుల పంట జాఫ్రా సాగు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అందడంతో నర్సరీ ఏర్పాటు చేసి జాఫ్రా మొక్కలను సైతం విక్రయిస్తున్నారు. జాఫ్రా సాగుతో పాటు ఆయిల్‌పామ్, జీడిమామిడి, పొగాకు, కూరగాయలు, వరి పంటల సాగు చేస్తూ గిరిజన మహిళా ఆదర్శ రైతుగా నిలిచారు. బుట్టాయగూడెం మండలం దాసయ్యపాలెంకు చెందిన మడకం వెంకాయమ్మ, భర్త జంపాలు గత 30 ఏళ్లుగా గిరిజన ప్రాంతంలో జీడిమామిడి, పొగాకు, కూరగాయలు, వరి వంటి పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే పంట మార్పిడిపై ఆలోచన చేస్తుండగా యూట్యూబ్‌లో, ఇంటర్‌నెట్‌లో జాఫ్రా పంటల గురించి తెలుసుకున్నారు. జాఫ్రా పంటలు పండించే ప్రాంతాలకు వెళ్లి పంట వేస్తే కలిగే లాభనష్టాలు గురించి వివరాలు సేకరించారు. అనంతరం తమ మూడు ఎకరాల్లో జాఫ్రా సాగు చేపట్టారు. రంపచోడవరం నుంచి 160 మొక్కల చొప్పున తీసుకు వచ్చి పంట వేశారు. సాధారణంగా జాఫ్రా పంట 14 నెలలకు చేతికి వస్తుంది. అయితే వీరు వేసిన పంట 9 నెలలకే దిగుబడి రావడంతో పాటు ఆదాయం కూడా అధికంగా రావడంతో ఆనందంతో కేరింతలు కొట్టారు. భర్త జంపాలు ఇతర పనుల్లో నిమగ్నం కావడంతో వెంకాయమ్మ జాఫ్రా సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సాగులో మొదటి సంవత్సరం 3 క్వింటాలు, రెండో ఏడాది 4 క్వింటాలు, మూడో ఏడాది 14 క్వింటాలు, ఈ సంవత్సరం 20 క్వింటాల వరకు దిగుబడి వచ్చినట్లు చెబుతున్నారు. క్వింటాకు రూ. 35 వేల చొప్పున విక్రయిస్తున్నామన్నారు. కేవలం రూ.60 వేలు మొక్కలకు మాత్రమే పెట్టుబడి పెట్టి ఆదాయం పొందుతున్నామని, మరో 20 ఏళ్ల వరకు పంటపై ఆదాయం పొందవచ్చని రైతు తెలిపారు.


రాష్ట్రంలోని పలు జిల్లాలకు మొక్కలు సరఫరా

బుట్టాయగూడెం మండలంలో పంట సాగుతో పాటు మొక్కల నర్సరీ కూడా ఏర్పాటు చేసిన రైతులు వెంకాయమ్మ, జంపాలు ఆ మొక్కలను రాష్ట్రంలోని పలు జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఇల్లందు, కొత్తగూడెం,పాల్వంచ, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తదితర జిల్లాలకు సుమారు 250 ఎకరాలకు మొక్కలను సరఫరా చేసినట్లు తెలిపారు. ఒక్కో మొక్క రూ.60కి విక్రయిస్తున్నామన్నారు.

జాఫ్రాలో అధిక ఔషధ గుణాలు

జాఫ్రా పంటలో ఔషధ గుణాలు, పోషక విలువలు అధికంగా ఉన్నట్లు నిపుణుల అధ్యయనంలో వెల్లడైంది. జాఫ్రా గింజల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే కెరోటినాయిడ్లు అధికంగా ఉన్నాయి. ఈ చెట్టు బెరడును ఆయుర్వేద వైద్యంలో గనేరియా వ్యాధి నివారణకు, విత్తనాల గుజ్జును బంక విరేచనాలను అరికట్టేందుకు, ఆకులను పాముకాటు విషం విరుగుడుకు, పచ్చ కామెర్ల వ్యాధి నివారణకు ఉపయోగిస్తారని నిపుణులు చెబుతున్నారు. జాఫ్రా పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ పంటను ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులు పండించే విధంగా ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు. తక్కువ పెట్టుబడితో, అధిక లాభాలతో పాటు ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల పాటు పంట దిగుబడి పొందే అవకాశం ఉండడంతో రైతులు ఈ పంటను సాగు చేసే విధంగా అధికారులు కృషి చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

జాఫ్రా గింజలకు డిమాండ్



జాఫ్రా గింజలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జాఫ్రా పంట సహజ సిద్ధమైన సింధూరం రంగును ఇస్తుంది. పలు వంటకాలతోపాటు సౌందర్య పోషకాలు, సబ్బులు, నెయిల్‌పాలిష్ వంటి వాటిలో కూడా ఈ గింజలను వినియోగిస్తారు. ముఖ్యంగా మహిళలు సౌందర్యం కోసం పెదాలకు లిప్‌స్టిక్‌గా ఈ జాఫ్రా గింజలను ఉపయోగిస్తారు.

– కె.కరుణశ్రీ, డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త (వెంకటరామన్నగూడెం), తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



ఇరగవరం ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: తుపాను ముందస్తు చర్యలు చేపట్టి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఇరగవరం మండల ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు, కౌలు రైతుసంఘం, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారికి మోమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కామన మునిస్వామి మాట్లాడుతూ పంటలు రైతులకు చేతికి అందే సమయంలో తుఫాను వల్ల రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తేమశాతం తగ్గించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తక్షణం వారికి సొమ్ములు అందించాలన్నారు. కౌలు రైతు సంఘ నాయకులు ఢిల్లీ కోటేశ్వరరావు, రైతు సంఘ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



లక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన లక్ష్మి భర్తను కోల్పోయి తన ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవిస్తోంది. ఆమెకు గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు చెన్నా త్రికళ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.ఎనిమిది వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాష్ ఆర్థిక సహకారం అందించారని గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షుడు చెన్నా జనార్దనరావు తెలిపారు. స్వయం ఉపాధికి చేయూతనందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎమ్పీటీసీ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయాలకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ప్రభుత్వ తక్షణం పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయుసీ నాయకులు బుచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్లతో కలిసి పెంటపాడు ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు తీర్చాలని మండల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు నిబంధనల మేరకు జీవో నెంబర్ 108 ప్రకారం జీతం నెలకు రూ. 11,500 తక్షణం చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా సంయుక్త కార్యదర్శి కె. లక్ష్మణరావు, పెంటపాడు మండల ఆయాల సంఘ సభ్యులు చుక్కల మాధవి, ఫాతిమా బేగం, జగం ప్రమీల, వారా వెంకటలక్ష్మి, కె. సత్యవతి, ముసలమ్మ, కె. రాజ్యలక్ష్మి, బండారు శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల, పట్టణపరిధి కడకట్ల, యాగర్లపల్లి గ్రామాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని శుక్రవారం తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కోసిన ధాన్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోతలు కోయని రైతులు వాతావరణం అనుకూలించే వరకు వేచి ఉండాలన్నారు. అనంతరం ఏఎంసీలో ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో బీఎంఎస్ ప్రమోదిని కుమారి చెప్పారు. శుక్రవారం తణుకు మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పాఠశాలల ఉపాధ్యాయ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సిబ్బందికి నిర్వహించిన కిషోరీ వికాసం పేరుతో ఒక శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ లోహిత్ జయ సాగర్ మాట్లాడుతూ గ్రామాల్లోని బాలికల సంరక్షణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు.

సర్కారు వైద్యులకు మార్గదర్శకాలు

- స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదులతో జారీ
- వైద్యుల పనితీరు, ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై ప్రతిరోజూ నివేదికలు
- ఆస్పత్రికో ప్రత్యేక అధికారి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లో విధినిర్వహణలో ఉన్న వైద్యులకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, వైద్య ఆరోగ్యశాఖలు నూతన మార్గదర్శకాలను జారీ చేశాయి. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు వైద్యులు పూర్తిస్థాయిలో ఆయా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటికే ఆయా విభాగాల నుంచి ఆస్పత్రుల సూపరింటెండెంట్స్, మెడికల్ ఆఫీసర్స్‌కు ఉత్తర్వులు అందాయి. ముఖ్యంగా ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉండడంలేదనే ఫిర్యాదులు ఇటీవల అధికమయ్యాయని ఈ నేపథ్యంలో నూతన మార్గదర్శకాలు అమలు చేస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈనెల 28న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వైద్యాధికారులకు సూచనలు చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లతోపాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో వైద్యులపై ప్రత్యేక అధికారులను నియమించి వారి వివరాలను సైతం జారీ చేశారు. ఇలా రెండు శాఖల్లోను ఆస్పత్రికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులుగా నియమించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు, మునిసిపల్ మేనేజర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించడమే కాకుండా ఆస్పత్రిలో ఉన్న వసతులు, అందుతున్న సేవలు, పారిశుధ్యం, రోగులకు అందుతున్న వైద్య సేవలు ఇలా అన్నిటిపైనా ప్రతిరోజూ సాయంత్రం జిల్లా కేంద్రానికి రిపోర్టు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఓపీ విభాగంలో అందుబాటులో ఉండి రోజుకు మూడుసార్లు ఎఫ్ఆర్ఎస్ విధిగా అటెండెన్స్ వేయాల్సి ఉంది.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణాంశాలు ఇవే..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా ఆస్పత్రుల్లో ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ప్రతిరోజూ కొన్ని అంశాలను పరిశీలించి జిల్లా కేంద్రానికి నివేదికను ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్‌లో వైద్యుల ఆలస్యం, ముందుగా వెళ్లిపోవడం, ఆస్పత్రి బయట ఉండడం, గైర్హాజరు, దీర్ఘకాలిక సెలవులు, సమాచారం లేకుండా సెలవులతోపాటు అత్యవసర విభాగం, ఇన్, అవుట్ పేషెంట్ల సేవల తాలూకా రిజిస్టర్లు, రోగుల అందుతున్న సేవలపై సమాచారం, రిఫరల్స్, రోగులకు అందిన సేవలు, వైద్యపరీక్షల సేవలు, రికార్డులు, మందుల పంపిణీ, స్టాక్, రికార్డులు, వైద్యుల పేర్లకు సంబంధించిన సమాచారం, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, ఎన్టీఆర్ వైద్యసేవ, జనన, మరణ ధృవపత్రాల రిజిస్ట్రేషన్, సదరం సేవలు, రోగులకు ఆహారం పంపిణీ, అభివృద్ధి కమిటీ సమావేశాలకు సంబంధించిన రికార్డులు, పారిశుద్ధ్యం, ఏఆర్‌టీ, ఐసీటీసీ సేవలు, ఆక్సిజన్, సెక్యూరిటీ వంటి సేవల ప్రధానాంశాలుగా నిర్దేశించారు.

ఫిర్యాదుల నేపథ్యంలో

జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని తిరిగి సాయంత్రం 4 గంటలకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో నూతన మార్గదర్శకాలను ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కొన్ని ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉంటున్నప్పటికీ ఓపీ విభాగంలో కాక విశ్రాంతి గదుల్లో కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే సాయంత్రం 4 గంటల వరకు వైద్యులను రోగులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో మాత్రమే ఈ మార్గదర్శకాలను జారీచేసినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

గుర్రుగా వైద్యులు...

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వెలువడిన నూతన మార్గదర్శకాలపై వైద్యవర్గాలు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా తమ పనితీరుపై వైద్యశాఖకు సంబంధంలేని ఇతర శాఖలకు చెందిన అధికారులను వైద్యులపై పర్యవేక్షణకు వేయడమేమిటని మల్లగుల్లాలుపడుతున్నారు. అసలు రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని నిబంధనలు కేవలం పశ్చిమకే ఎందుకు వర్తింప జేస్తున్నారనే ప్రశ్నలు సైతం వేస్తున్నారు.

పశ్చిమగోదావరిలో ప్రభుత్వ ఆస్పత్రులు ఇలా..

జిల్లా కేంద్ర ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు	3
ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు	34
పట్టణ ఆరోగ్య కేంద్రాలు	18

సత్వర వైద్యసేవలందిస్తాం...

రోగులకు సత్వర వైద్యసేవలందించాలనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ నుంచి వైద్యసేవలు, వసతులు, ప్రత్యేక అధికారి అంశాలకు సంబంధించిన విధివిధానాలు అందాయి. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులంతా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ వెలగల అరుణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

తణుకు సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి



తణుకు సబ్‌జైలులో ముద్దాయిలకు అందించే ఆహారాన్ని రుచి చూస్తున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ముద్దాయిలకు అందించే ఆహార విషయంలో నిబంధనలు పాటించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి జైలు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తణుకు సబ్ జైలును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వివిధ కేసుల్లో రిమాండ్‌లో ఉన్న వారు తమకు న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమతలేని పక్షంలో న్యాయస్థానం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మంచి సత్ప్రవర్తనతో మెలగాలని ముద్దాయిలకు సూచించారు. కేసులు రాజీ చేసుకోవాలనుకునే వారు న్యాయస్థానాన్ని, పోలీసులను, న్యాయవాదులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలతోపాటు ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మోహనరావు, న్యాయవాదులు టి.సత్యనారాయణరాజు, ఎ.అజయ్‌కుమార్, కుమారి మోతి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న తణుకు ఏడీఏ రమేష్, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: ఎరువులు ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని తణుకు వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్ హెచ్చరించారు. జంబ్లింగ్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శనివారం మండలంలోని పెదతాడేపల్లి, పట్టణ పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏవో ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్ మాట్లాడారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ బోర్డుల్లో స్టాకు వివరాలు నమోదు చేయాలన్నారు. తనిఖీల్లో రూ.86,534లు విలువైన ఎటువంటి అనుమతి లేని పురుగు మందులు అమ్మకాలను నిలుపుదల చేశారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలి



కె. పెంటపాడులో రైతుల వివరాలు తెలుసుకుంటున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెంటపాడు: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు త్వరితగతిన ధాన్యం మిల్లులకు తరలించుకోవాలని జెసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పెంటపాడు మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కె. పెంటపాడు, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం దృష్ట్యా రైతులు ధాన్యం భద్రపరుచుకోవాలన్నారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రైతు సేవాకేంద్రాల ద్వారా మిల్లులకు తరలించుకోవాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. గోనెసంచులు సిద్ధంగా ఉంచామన్నారు. తమకు అనుకూలంగా ఉన్న మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఏడీఏ పి. మురళీకృష్ణ, ఏవో సారధి, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల పట్ల వేధింపులను అరికట్టాలి



జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు, బాలికల పట్ల వేధింపులు, లైంగిక దాడులను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపాదేవి అన్నారు. జాతీయ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా శుక్రవారం మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ స్త్రీలు, 18 ఏళ్ల బాలికలు ఎదుర్కొంటున్న గృహహింసలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయని, వారికి ఎటువంటి అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాండ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు బీవీఎస్. మల్లేశ్వరి, ఆరోగ్య సహాయకులు లక్ష్మణ్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, సీహెచ్‌వో నీరజ, ఏఎన్ఎం శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని బాలుడికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: అతివేగంగా లారీ, బాలుడిని ఢీకొనడంతో గాయాలైన సంఘటన మండలంలోని పెదతాడేపల్లి సెంటర్‌లోని రాష్ట్ర రహదారిపై చోటు చేసుకుంది. శుక్రవారం రూరల్ ఎస్ఐ జేవీఎన్.ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదతాడేపల్లి గ్రామ శివారు పోచంపురం ప్రాంతానికి చెందిన మానుకొండ సందీప్ తన కుమారుడు ప్రశాంత్‌కుమార్ (5)కు ఫ్రైడ్ రైస్ చేయిస్తుండగా, ఒక్కసారిగా బాలుడు రోడ్డుపైకి రావడంతో అటుగా వెళ్తున్న లారీ (ఏపీ 39 యుజే 6540) ఢీకొంది. ఈ సంఘటన ఈ నెల 26వ తేదిన సాయంత్రం జరిగింది. దీంతో బాలుడు ప్రశాంత్‌కుమార్‌కు ముఖం, తలపై గాయాలయ్యాయి. అతనిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు బాలుని తండ్రి మానుకొండ సందీప్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుపై రూరల్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను హడలెత్తిస్తున్న వాతావరణం



అత్తిలిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఉంచిన దృశ్యం

అత్తిలి: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు ప్రారంభంకావడంతో రైతాంగం ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అత్తిలి మండలంలో 14,500 ఎకరాలలో సార్వాసాగు చేపట్టారు. వరికోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈతరుణంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడటంతో మాసూళ్లకు ఆటంకం ఏర్పడింది. వరికోత యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రాశులు చేసి, టార్పాలిన్‌లు కప్పారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖహెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తమైంది. దీంతో గత రెండు రోజులుగా వరికోతలను రైతులు వాయిదావేసుకున్నారు. ఇప్పటికే వరిపంట నూర్పిడి చేసి ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించారు. పంటచేతికందే సమయంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులలో ఆందోళన నెలకొంది.

తుఫాన్ చినుకులతో రైతుల హైరానా

తణుకు టౌన్: తుఫాన్ కారణంగా ఖరీఫ్ వరి పంట మసూళ్లకు సంబంధించి రైతులు హైరానా పడుతూ ధాన్యాన్ని ఒడ్డుకు చేరుస్తున్నారు. శుక్రవారం సాయంత్రం తుఫాన్ కారణంగా వర్షపు జల్లులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు.

ఫార్మశీ అంటే ఆరోగ్య సంరక్షణ

తాడేపల్లిగూడెం: ఫార్మశీ అంటే ఆరోగ్య సంరక్షణ అని నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. విద్యాలయంలో శుక్రవారం ఫార్మశీ వారోత్సవాలు జరిపారు. అశోక్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన కమ్యూనిటీలను ప్రోత్సహించడం ద్వారా రోగుల సంరక్షణ, భద్రతకు భరోసా ఇచ్చేది ఫార్మశీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మినీ మెడికల్ క్యాంపు, బ్లడ్‌గ్రూపు టెస్టింగ్ , బాడీమాస్ ఇండెక్సు విశ్లేషణ, డయాబెటిస్ స్క్రీనింగ్ సేవలను అందించారు. ఫార్మశీ కోర్సు కో ఆర్డినేటర్ లిఖిత తదితరులు పాల్గొన్నారు.

దానేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి లక్ష పత్రి పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆలయకమిటీ సభ్యులతోపాటు పరిసర గ్రామా ల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. భద్రాచలం బస్సు టైమింగ్స్ మార్చమని, ఉదయం 8 గంటలకు భీమవరం విష్ణు కళాశాలకు వెళ్లేటట్లు బస్సు ఏర్పాటు చేయమని ప్రయాణికులు కోరారన్నారు. కంతేరు మీదుగా నర్సాపురం బస్సు ఏర్పాటు చేయమని, రాత్రి 10 గంటలకు పాలకొల్లుకు బస్సు కావాలని కోరినట్లు తెలిపారు. తణుకు- దొడ్డిపట్ల బస్సు సర్వీసు, రాజమండ్రికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్ కావాలని కోరారని చెప్పారు. వినతులు పరిశీలించి సాధ్యమైనవి ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ పాల్గొన్నారు.

పెంటపాడు శివాలయంలో విశేష పూజలు



పెంటపాడులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెంటపాడు: కార్తీక మాసం ముగింపు సందర్భంగా పెంటపాడు పార్వతి రామలింగేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, ఏకాదశ రుద్రాభిషేకం, సుందరకాండ పారాయణం, సూర్యనమస్కారాలు, లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, రుద్రహోమం, జ్యోతిర్లింగార్చన, దీపోత్సవం, అనంతరం మహిళల చండీహోమం, కుంకుమపూజలు నిర్వ హించారు. రాత్రి సుమారు 4 వేల మందికి భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరాలకు మంగళం



ఇరగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)



పేదలకు ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

- వైఎస్సార్ సీపీ హయాంలో స్పెషలిస్టు డాక్టర్లతో సేవలు
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- ప్రస్తుతం ఊసెత్తని వైనం

ఇరగవరం: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇబ్బందులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– పొట్ల సురేష్,న్యాయవాది, తణుకు

వెలిగిన వీధి దీపాలు



స్థానిక 2వ వార్డులో వెలిగిన వీధి దీపాలు

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక 2వ వార్డులోని పలు ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం విద్యుత్తు దీపాలు వెలిగాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, విష సర్పాలు సంచరిస్తున్నాయని, దీనికితోడు దొంగల బెడద అధికంగా ఉంటుందని ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని స్థితి ఉంటుందని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నట్లు సాక్షిలో శుక్రవారం కథనం వెలువడింది. దీంతో కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. వీధి దీపాలు వెలిగించారు.

పెదతాడేపల్లిలో స్క్రీనింగ్ పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో ముందస్తు కేన్సర్ నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో పి.నవ్య లక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు డి. రత్నకుమారి, బీవీ.కుమారి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com